నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | మార్చి 20, 2025 | www.navatelangana.com

చలివేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

నిర్మల్ : జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్(మంచిర్యాల చౌరస్తా)లో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ప్రజలకు కలెక్టర్ మంచినీటిని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పట్టణంలో బస్టాండ్, ప్రధాన కూడళ్లు, మార్కెట్లు, జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో విరివిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలంతా చలివేంద్రాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఎండలు విపరీతంగా ఉన్నాయని, వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, అర్బన్ తహసీల్దార్ రాజు, మున్సిపల్ డీఈ హరిభువన్ పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

సారంగాపూర్ : బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదంతో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌తో రాజకీయంగా ఎదిగేందుకు దోహద చేస్తుందన్నారు. రాజీవ్ వికాస్ యోజన పథకం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య, ఎఎంసి ఛైర్మెన్ అబ్దుల్ హది, నాయకులు దశరథ్ రాజేశ్వర్, ముత్యంరెడ్డి, నారాయణరెడ్డి, నవీన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మధుకర్, రాజేశ్వర్, పోతన్న, రాజురెడ్డి, భూమన్న, రాజేంద్రప్రసాద్, సురేందర్, సుమన్ పాల్గొన్నారు.



సంక్షేమానికి పెద్దపీట..!

- ఆరు గ్యారెంటీల అమలుకు అధిక ప్రాధాన్యం
- విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం అంబులెన్స్ వ్యవస్థ
- ఉమ్మడి జిల్లాలో పలు సాగునీటి ప్రాజెక్టులకు నిధులు
- నూతన పరిశ్రమలు.. అభివృద్ధి పనులపై కనిపించని దృష్టి
- రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసుల్లో మిశ్రమ స్పందన

బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలకు నిధుల కేటాయింపులు చేసింది. దీంతో రానున్న ఏడాదిలోనూ ఆయా పథకాలు సమర్థవంతంగా అమలయ్యేందుకు ఆస్కారం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వం యువ వికాసం కింద యువతకు స్వయం ఉపాధి కల్పించాలని నిర్ణయించడంతో సంక్షేమ శాఖలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంతో పురోగతిలోకి వచ్చేందుకు అవకాశం కనిపిస్తోంది. కుప్టి, పులిమడుగు, త్రివేణి సంగమం వంటి ప్రాజెక్టుల సర్వే కోసమూ నిధులు కేటాయించింది. ముఖ్యంగా విద్యుత్ అంతరాయం వంటి సమస్యలు ఉత్పన్నమైన సమయంలో వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు ప్రత్యేకంగా అంబులెన్స్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానుంది. మరోపక్క జిల్లాలోని అపారమైన వనరులు ఉన్నప్పటికీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గుచూపలేదు. జిల్లాలో అభివృద్ధి పనులపైనా అంతగా దృష్టిసారించినట్లు కనిపించలేదు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసుల్లో మిశ్రమ స్పందన కనిపిస్తోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం శాసనసభలో 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రాష్ట్ర ఆర్థికమంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యం కనిపిస్తోంది. ప్రభుత్వం అభయహస్తం కింద అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలైన మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత వంటి పథకాలకు నిధులు కేటాయించింది. దీంతో తొలి విడతలో చేపట్టనున్న నియోజకవర్గానికి 3500చొప్పున ఇండ్ల నిర్మాణానికి మోక్షం లభించనుంది. ఉమ్మడి జిల్లాలో 35వేల మందికి లబ్ది చేకూరనుంది. గృహజ్యోతి కింద 3.60లక్షల మందికి లాభం జరగనుంది. చేయూత కింద ఆదిలాబాద్ జిల్లాలో 76వేల మందికి పింఛన్లు అందించగా..ఉమ్మడి జిల్లాలో ఈ సంఖ్య రెట్టింపు ఉంది. ముఖ్యంగా రైతుభరోసాకు రూ.18వేలకోట్లు కేటాయించడం ద్వారా రానున్న ఖరీఫ్‌లో రైతులకు పెట్టుబడి సాయం అందే అవకాశం కనిపిస్తోంది. వ్యవసాయ రంగానికి రూ.24,439 కోట్లు కేటాయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 6.15లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు..!

ప్రభుత్వం సాగునీటి రంగానికి బడ్జెట్‌లో రూ.23,373కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు సైతం నిధులు కేటాయించడం శుభ పరిణామంగా మారింది. ఆదిలాబాద్ జిల్లాలోని చనాక-కోర్టకు రూ.179.13కోట్లు, మత్తడివాగుకు రూ.3కోట్లు, సాత్నాలకు రూ.8.52కోట్లు కేటాయించగా.. కుప్టి, పులిమడుగు, త్రివేణి సంగమం ప్రాజెక్టుల సర్వే కోసం రూ.50లక్షల చొప్పున కేటాయించింది. దీంతో చనాక-కోర్ట ప్రాజెక్టు కాల్వల కోసం భూసేకరణ చేపట్టేందుకు మార్గం సుగుమమైంది. మరోపక్క ప్రాణహితకు రూ.32.22కోట్లు, మంచిర్యాల చుట్టూ నిర్మించే రక్షణ గోడకు రూ.100కోట్లు కేటాయించగా.. పెద్దవాగుకు రూ.10కోట్లు, జగన్నాథ్‌పూర్‌కు రూ.10.70కోట్లు, నీల్వాయికి రూ.13కోట్లు, ఎస్ఆర్ఎస్‌పీకి రూ.99.65కోట్లు కేటాయించడం ద్వారా ఆయా ప్రాజెక్టుల నిర్మాణాల్లో పురోగతి కనిపించనుంది.

గిరి జల వికాసంతో మేలు..!

ఆదివాసీ గిరిజన రైతుల కోసం ప్రభుత్వం గిరిజల వికాసం పథకాన్ని ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా పోడు భూముల్లో సాగునీటి వసతి కల్పించడంతో పాటు సౌర ఆధారిత పంపుసెట్లు ఏర్పాటుచేసి నాలుగేండ్లలో రైతులను అభివృద్ధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో రూ.12,600కోట్లు కేటాయించగా.. ఈ పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలో సుమారు 1.25లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. మరోపక్క ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలకు నిధులు కేటాయించడం ద్వారా యువతకు స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు దోహదం చేయనుంది. ముఖ్యంగా జిల్లాలో అపారమైన ఖనిజ వనరులు ఉన్నప్పటికీ ఆయా అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించకపోవడం జిల్లావాసులను నిరాశకు గురిచేసింది. జాతీయ రహదారి సౌకర్యం ఉన్నప్పటికీ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

అందరికీ ఆమోదయోగ్యమైంది : వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్యే ఖానాపూర్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైంది. అన్ని శాఖలకు నిధులు కేటాయించడం శుభపరిణామం. గిరిజన సంక్షేమశాఖకు కూడా రూ.17వేల కోట్లు కేటాయించింది. ప్రభుత్వం అన్ని శాఖలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షించడంతో పాటు రానున్న రోజుల్లో మంచి ఫలాలు అందిస్తుంది.

నిధులను సక్రమంగా ఖర్చు పెట్టాలి : దర్శనాల మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, ఆదిలాబాద్



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సక్రమంగా ఖర్చు చేయాలి. కేవలం కేటాయింపులకే పరిమితం కాకూడదు. ముఖ్యంగా దళితుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను దారి మళ్లిస్తున్నారు. ఇలాంటివి జరగకుండా చూడాలి. పిప్పల్‌కోటి రిజర్వాయర్ భూ నిర్వాసితులను అందించాల్సిన పరిహారం డబ్బులు కూడా త్వరగా విడుదల చేయాలి.

బోధించే ఉపకరణాలు ఎంతో ఉపయోగం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రత్యేక అవసరాల గల పిల్లలకు బోధించేందుకు అందించే ఉపకరణాలు ఎంతో ఉపయోగపడతాయని విద్యాశాఖ జిల్లా సమన్వయకర్త సుజాత్‌ఖాన్ అన్నారు. బుధవారం భవిత విలీన కేంద్రంలో ఏక్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పన్స్ ఫండ్ కింద బోధన పరికరాలను అందించారు. వాటిని కేంద్రంలోని ఉపాధ్యాయులకు అందించి నాణ్యమైన బోధనలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సుజాత్‌ఖాన్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ సహకారంతో కార్పొరేట్ సోషల్ రెస్పన్స్ ఫండ్ కింద ఎంపిక చేసిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల పాఠశాలలకు దివ్యాంగులకు ఉపయోగపడేలా బోధన ఉపకరణాలను అందించారన్నారు. వీటి ద్వారా వారికి నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతుందన్నారు. ప్రత్యేక అవసరాలకు నాణ్యమైన బోధనలు అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, ఎంఈఓ సోమయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం లచ్చిరాం, పాఠశాల హెచ్ఎం లక్ష్మణ్ పాల్గొన్నారు.

గ్రూప్-1 పున:మూల్యాంకనం చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఇటీవల జరిగిన గ్రూప్-1 పరీక్షల్లో తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో కొమురం భీం విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిఎస్ఎస్ఓ, ప్రజాతంత్ర విద్యార్థి సంఘం, డిఎస్ఓ, ఆదివాసి విద్యార్థి సంఘాల నాయకులు జాడి వెంకటేష్, నేతవత్ రవీందర్, జంగుదేవ్ పటేల్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా టీజీపీఎస్సీ వైఖరి మారడం లేదన్నారు. గత ప్రభుత్వంలో 18 ఉద్యోగాల నియమాకాల్లో అక్రమాలు జరిగాయని, అప్పటి ప్రభుత్వం గ్రూప్ పోస్టులు రద్దు చేసిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో టీజీపీఎస్సీ ప్రక్షాళన జరగలేదని, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ ద్వారా గ్రూప్-1 పోస్టు నియమాకాలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు తొడసం రాజు, కనక తుకారాం, కె.జంగు పాల్గొన్నారు.

విద్యార్థులు భయాందోళన గురికాకుండా పరీక్షలు రాయాలి

నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం సింగరేణి ఉన్నత పాఠశాల సిసిసిలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. దీనికి జీఎం శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకోవాలని, తద్వారా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హాల్ టికెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం తరపున విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్‌ను జీఎం చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు ఆర్.విష్ణువర్ధన్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ పాల్గొన్నారు.

విచ్చలవిడిగా చెట్ల నరికివేత



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దుబ్బగూడెం గ్రామంలో పలువురు ఇష్టానుసారంగా చెట్లను నరికి వేస్తున్నారు. చెట్లను నరికి యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఖాళీ ప్రదేశాల్లో ఉన్న భారీ వృక్షాలు, చెట్లను నరికి వేసి తరలించడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్ల రక్షణపై అటవీ శాఖ అవగాహన కల్పిస్తుంటే ఇలా ఇష్టానుసారంగా చెట్లను నరికి వేస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్ట్రీట్ వెండర్స్ కెమెరాలు అమర్చుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే చిన్నచిన్న వ్యాపారస్తులు కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా వ్యాపారస్థులకు తగిన సూచనలు చేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ రోజువారీ రోడ్డు మీద ఉండే చిన్న చిన్న వ్యాపారస్తులు రోడ్ల మీదకు రాకుండా చూసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గకుండా చూసుకోవాలని తెలిపారు. వ్యాపారస్తులకు సీసీ కెమెరాల ద్వారా జరిగే ఉపయోగాలు తెలిపి వాటి ఏర్పాటుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు పంపిణీ

ఉట్నూర్: మండలంలోని శ్యామ్‌పూర్ గ్రామ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులను ఎస్సీ ఎస్టీ యాక్ట్ విలేజ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాటం రమేష్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి చదువు చదివి ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు చవాన్ భారత్, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌సింగ్, మాజీ ఎంపీటీసీ బాలాజీ, మాజీ సర్పంచ్ జాదవ్ జగదీష్, అంగన్వాడీ టీచర్ కాటం సంగీత, సామాజిక కార్యకర్త కాటం రవీందర్, పాండురంగ్, రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయినగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

బోథ్ : మండల కేంద్రంతో పాటు సాయినగర్ కాలనీలో తాగునీటి సమస్య తీర్చాలని బుధవారం బీఆర్ఎస్ నాయకులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు నీటి కొరత ఎక్కువవుతోందని, సమస్య తీర్చాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో నీటి సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఎలక రాజు, మెడిచేల్మ ప్రవీణ్, బొడ్డు శ్రీనివాస్, డాక్టర్ స్వామి, రమణ, రఫీ, రమేష్, రూప్‌చంద్, సోలంకి సత్యనారాయణ, బాపురెడ్డి, రవి పాల్గొన్నారు.

కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో అత్యధిక ఉత్పత్తి

కాసిపేట : మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో ఒక్క రోజు 646 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి రికార్డ్ సాధించింది. గతంలో సాధారణ బొగ్గు ఉత్పత్తిగా సాగిన గని చరిత్రలో 18న మంగళవారం ఒక్క రోజే అత్యధికంగా 646 టన్నులు ఉత్పత్తి సాధించడం ఇదే మొదటి సారి. గతంలో అనేక వివాదాలతో ఉన్న గని ఉత్పత్తిలో సాధారణ స్థాయిలోనే ఉండిపోయేది. ప్రస్తుతం ఉత్పత్తి శాతం పెరుగుతూ వస్తూ ప్రగతి పథంలో నడుస్తున్నది. గని చరిత్రలో ఇదే మొదటి సారని, ఇలానే కొనసాగాలని గని మేనేజర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అందరి కృషి వల్లే ఇది సాధ్యమైందని, ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరింత ఉన్నతమైన లక్ష్యాలను చేరుకునేందుకు ముందుకు సాగుదామని పేర్కొన్నారు. ఈ విజయంలో భాగమైన అధికారులకు, సూపర్వైజర్లకు, టెక్నిషియన్లకు, ఉద్యోగులకు, యూనియన్ నాయకులకు మేనేజర్ అభినందనలు తెలిపారు.

సీసీఐ పునరుద్ధరణకు స్పష్టమైన హామీనివ్వాలి

- సీసీఐ సాధన కమిటీ దీక్షలు ప్రారంభం



దీక్షల్లో కూర్చున్న సీసీఐ సాధన కమిటీ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వాసుల చిరకాల ఆకాంక్ష అయిన సీసీఐ పునరుద్ధరణకు కేంద్రం ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే స్పష్టమైన హామీ ఇవ్వాలని సీసీఐ సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణే ధ్యేయంగా సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలను బుధవారం ఆయన ప్రారంభించారు. కలెక్టరేట్ ఎదుట ప్రారంభమైన దీక్షల్లో సాధన కమిటీ నాయకులు పాల్గొని నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న మాట్లాడుతూ ప్రాణం ఉన్నంత వరకూ సీసీఐ పునరుద్ధరణకు పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఫ్యాక్టరీ పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన సీసీఐ పునరుద్ధరణకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక మార్లు కేంద్రానికి విన్నవించామని, కేంద్ర మంత్రులను పలు దఫాలుగా కలిసినా ఎటువంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ పున:ప్రారంభంపై బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు అసత్య ప్రచారాలు చేయడం ఇకనైనా మానుకోవాలని, కేంద్రం స్పష్టమైన హామీని ప్రకటించేలా చూడాలని హితవు పలికారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే సీసీఐ పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధిపై కేంద్రం చిత్తశుద్ధిగా వ్యవహరించడం లేదని మండిపడ్డారు. అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఫ్యాక్టరీని తుక్కు కింద అమ్మెయ్యడానికి టెండర్ పిలవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇక్కడి ఎమ్మెల్యే, ఎంపీ ఈ విషయంపై దృష్టి సారించాలని, అవసరమైతే అఖిలపక్షం తరపున కేంద్ర మంత్రులను కలిసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. దీక్షలో సాధన కమిటీ కో కన్వీనర్ విజ్జగిరి నారాయణ, వెంకట్‌నారాయణ, లంక రాఘవులు, అరుణ్ కుమార్, ముడుపు ప్రభాకర్‌రెడ్డి, కస్తాల ప్రేమల, లోకారి పోశెట్టి, జగన్‌సింగ్, ఈశ్వర్‌దాస్, అలాల్ అజయ్, స్వరూప పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

- ఇరిగేషన్ మంత్రికి సీపీఐ(ఎం) బృందం విజ్ఞప్తి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సాగునీరు అందించలేకపోతున్న ప్రాజెక్టులకు రూ.302కోట్లు కేటాయిస్తే 86వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని సీపీఐ(ఎం) నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. వార్ధా(ప్రాణహిత) ప్రాజెక్టుకు ఈ సంవత్సరమే శంకుస్థాపన చేసేలా నిధుల కేటాయింపులు చేయాలని కోరారు. సీపీఐ(ఎం) మాజీ శాసనసభా పక్షనేత జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, రాష్ట్ర నాయకులు కె.సతీష్‌కుమార్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాజెక్టులపై జల సౌధలో సమావేశం ఏర్పాటు చేస్తామని, నిధులు కేటాయింపు చేస్తామని ప్రాణహిత ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్థికంగా, వ్యవసాయ పరంగా వెనకబడిన కుమురం భీం జిల్లాను అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. వినతి పత్రాన్ని నీటి పారుదల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాహుల్ బొజ్జాకు పంపించారు. మంత్రిని కలిసిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్, గోడిసెల కార్తీక్ ఉన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో ఆశాల సమస్యలు చర్చించాలి

- కలెక్టరేట్ ఎదుట నిరసన
- అదనపు కలెక్టర్ శ్యామలదేవికి వినతి



అదనపు కలెక్టర్ శ్యామలదేవికి వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బడ్జెట్ సమావేశాల్లో ఆశాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆశాలు ఆందోళన చేపట్టారు. బైటాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వారి వద్దకు అదనపు కలెక్టర్ శ్యామలదేవి రాగా వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ కార్యక్రమం తీసుకున్నా ఆశా కార్యకర్తలను ముందు ఉంచుతున్నాయన్నారు. కానీ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. ఈ బడ్జెట్ సమావేశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలకు బడ్జెట్ కేటాయించి సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఆశాలకు రూ.18,000 ఫిక్స్ వేతనం నిర్ణయించాలని, పిఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాల గురించి మేనిఫెస్టోలో చేర్చిన విధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, వెయిటేజీ మార్కులు వెంటనే నిర్ణయించాలని, రూ.50లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని అమలు చేస్తూ ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలని కోరారు. సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని, అసెంబ్లీ, పార్లమెంట్‌ను సైతం ముట్టడించడానికి ఆశాలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న, నాయకులు ఆర్.సురేందర్, ఆశా యూనియన్ నాయకులు జ్యోతి, కాంత, లక్ష్మి, లత, మాధవి, స్వరూప, లలిత, పద్మ, లత, ఆశ, అనిత పాల్గొన్నారు.

24న వాలీబాల్ టోర్నమెంట్

సిర్పూర్(టి): జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఈ నెల 24 నుండి మూడు రోజుల పాటు కౌటాల పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ కమలాకర్ తెలిపారు. మండలంలోని ఆసక్తిగల క్రీడాకారులు 22లోపు ఈ సెల్ నెంబర్‌లో 8466943511 సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు జాగ్రత్తగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు జాగ్రత్తగా ఉండాలని కౌటాల ఎంఈఓ గావుడె హనుమంతు అన్నారు. బుధవారం మండలంలోని కుంబారి పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయురాలు దీక్ష టిఎల్ఎం ఆధారంగా బోధించడంతో ఆమెను అభినందించారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. మార్చి చివరిలోగా మిడ్‌లైన్ పరీక్షలు నిర్వహించి సంబంధిత పోర్టర్‌లో ఫలితాలను నమోదు చేయాలని సూచించారు. ప్రతిరోజు సమయపాలన పాటించి విద్యార్థులు వంద శాతం హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎండాకాలం ఎండల తీవ్రత ఎక్కువ ఉన్న కారణంగా విద్యార్థులు ఎవరు కూడా పాఠశాల అనంతరం బయట తిరగకుండా ఇంట్లోనే ఉండి హోంవర్క్ చేసేలా సూచనలు చేయాలని కోరారు.

వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఉపన్యాసం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్ వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాసం బుధవారం నిర్వహించారు. దీనికి దక్కన్ గ్రామీణ బ్యాంక్ మున్సిపల్ కాంప్లెక్స్ బ్రాంచ్ ముఖ్య నిర్వహణాధికారి అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ చట్టాలపై అవగాహన కల్పిస్తూ, బ్యాంకింగ్ సేవలను, పొదుపు పథకాలను, బ్యాంకింగ్ రంగంలో ఉన్న



ఉద్యోగ అవకాశాలను, ఆన్‌లైన్ మోసాలను జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.అతీక్ బేగం, వైస్ ప్రిన్సిపల్ వాణిజ్య శాస్త్ర విభాగం అధిపతి గణపతి రఘు, అధ్యాపకులు చంద్రకాంత్, సౌజన్య, కార్తీక్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్

ఎల్ఐసీ ఏజెంట్‌ల సమస్యలు పరిష్కరించాలని బుధవారం నిర్మల్ జిల్లా ఎల్ఐసీ ఏజెంట్‌లు ఐఆర్‌డీఏ, కేంద్ర ప్రభుత్వం, భారతీయ జీవిత బీమా సంస్థలు అవలంబిస్తున్న మొండివైఖరికి నిరసనగా ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో చేపట్టిన దేశ వ్యాప్త ఎల్ఐసీ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మల్ ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ అధ్యక్షులు గాండ్ల నారాయణ, ప్రధాన కార్యదర్శి పుప్పాల భాస్కర్ మాట్లాడారు. పాలసీదారుకు పాలసీపై బోనస్ పెంచాలన్నారు. ఈ ధర్నాలో యూనియన్ కోశాధికారి ముజ్జిగ వినోద్ కుమార్, మాడ చిన్నయ్య, పోతగంటి మల్లేశం, బ్రహ్మావత్ రామారావు, కమతాల శ్రీనివాస్, సందు, రాజేశ్వర్, రాజరపు శ్రీనివాస్, కొండల్వార్ రాములు, కండికే గౌతమ్, డి.గంగాదర్, పెండెం శ్రీనివాస్, నిర్మల్ బ్రాంచ్ నుండి 50 మంది ఏజెంట్లు పాల్గొన్నారు.



బీసీ రిజర్వేషన్ చారిత్రాత్మక నిర్ణయం

- కంది శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-జైనథ్

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్ర శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలుపడాన్ని హర్షిస్తూ బుధవారం మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ప్రముఖుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ చేస్తానని హామీ ఇచ్చి దేశంలోనే మొట్ట మొదటిసారిగా రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన అనంతరం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏడు నెలల్లో శాసన ప్రక్రియను పూర్తి చేసిందని 30 ఏండ్లుగా వర్గీకరణ కోసం జరుగుతున్న పోరాటానికి న్యాయం లభించినట్టు అయ్యిందన్నారు. అనేక ప్రజా సంక్షేమ పథకాలతో ప్రజా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్‌రావు, నాయకులు నాగర్కర్ శంకర్, దాసరి ఆశన్న, రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ అల్లూరి అశోక్ రెడ్డి, దేవదాయ శాఖ కమిటీ చైర్మెన్ రూకేష్‌రెడ్డి, గడ్డం జగదీష్‌రెడ్డి, వెంకన్న యాదవ్, బద్దం భగవాండ్లు, మాజీ ఎంపీటీసీ వెంకన్న, అశోక్, బద్దం సురేష్, కొడిచెర్ల లస్మన్న, ఏఎంసీ డైరెక్టర్ ఎల్మ రాంరెడ్డి, కాప్రి లింగారెడ్డి, పిడుగు స్వామి యాదవ్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు దేశానికే మార్గదర్శకం



నవతెలంగాణ-తాంసి

బీసీ రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం తెలుపడం దశబ్దాల సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చూపడంతో దేశానికే మార్గదర్శకమని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. బుధవారం తాంసి, భీంపూర్ మండలంలో మండల నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకం కింద సీఎం రూ.6వేల కోట్లు మంజూరు చేశారని, ఒక్కో నియోజకవర్గానికి 4 నుంచి 5వేల లబ్దిదారులకు అందించడంతో బోథ్ నియోజకవర్గంలో సంబరాలు, ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీసీ బిల్లు దేశానికే మార్గదర్శకం స్థానిక సంస్థల్లో, విద్యా ఉపాధి అవకాశాల్లో బలహీనవర్గాలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని గొప్ప విప్లవాత్మక బిల్లు ఆమోదం పొందిందని అన్నారు. బీసీల్లోని పలు కులాలు నేటికి కూడా చట్ట సభల్లో రాలేని, పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో తలమడుగు మాజీ జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, అశోక్, రామన్న యాదవ్, అశోక్, నారాయణ, సంతోష్, అన్ను పటేల్, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, మండల కన్వీనర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిసర్వేషన్ కల్పిస్తూ, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించి, యువకులకు రాజీవ్ యువ వికాసం ప్రవేశపెట్టినందుకు ఆంజనేయ స్వాములు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు బుధవారం మండలంలోని లక్కారంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్టంలో బీసీలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత రేవంత్‌రెడ్డికి దక్కుతుందని అన్నారు. మేము ఎలావేళలా ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకి రుణపడి ఉంటామన్నారు. అనతికాలంలోనే రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గొల్లపెల్లి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సింగారి వెంకటేష్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తెలంగాణ రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో విద్యారంగానికి జరిగిన తీవ్ర అన్యాయం చేసిందని, నిరసిస్తూ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సింగారి వెంకటేష్ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దగ్ధం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.57శాతం అంటే రూ.23,108 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని ప్రకటించుకుందన్నారు. దాన్ని కూడా అమలు చేయలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. రాష్టంలో విద్యాభివృద్ధి బాగుపడాలంటే బడ్జెట్‌లో విద్యా రంగానికి కనీసం 20శాతం నిధులు కేటాయించి, విద్యారంగాన్ని అభివృద్ధి చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి అధిక నిధులు పెంచి ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని, లేనియెడల ఈనెల 21న అసెంబ్లీ ముట్టడిస్తామని, రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, నవీన్, వెంకటేష్, రాహుల్ పాల్గొన్నారు.

ఆశాలకు నిర్ణీత వేతనం అమలు చేయాలి

- కలెక్టరేట్‌ను ముట్టడించిన ఆశాలు



కలెక్టరేట్ గేటు వద్ద బైటాయించిన ఆశాలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఆశాలకు నిర్ణీత వేతనం అమలు చేయాలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. బుధవారం తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిర్మల్ జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 6 గంటలకే కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మె సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశ వర్కర్లకు రూ.18వేలు నిర్ణీత వేతనం, ఇన్సూరెన్స్, రూ.50లక్షలు వర్తింపజేయాలన్నారు. పారితోషకం లేని పనులను, ఆశ వర్కర్లతో చేయించరాదని ఆశ వర్కర్లపై అధికారుల వేధింపులు ఆపాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పండగ సెలవులు, వారాంతపు సెలవులు ఇవ్వాలని, ఆశాలకు పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.గంగామణి, ఉపాధ్యక్షులు చంద్రకళ, భాగ్య, విజయ, సరిత, ఇంద్రమాల, నంద, జిల్లా సహాయ కార్యదర్శులు, జ్యోతి, శ్యామల, సుగుణ, మౌనిక, సులోచన, జిల్లా కోశాధికారి రామలక్ష్మి, కమల, విజయ పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ఈసారైన స్టేట్‌లో సింగిల్ డిజిట్ వచ్చేనా...?

- గత సంవత్సరం రాష్టంలో 17వ స్థానం
- ఈసారి మెరుగైన స్థానం కోసం ప్రత్యేక ప్రణాళిక
- ఫలితాలపై కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ



పది విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి పరీక్షలు ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. గతంలో కంటే ఈసారి మెరుగైన ఫలితాలు సాదించేందుకు ప్రత్యేక కార్యాచరణ, శ్రద్ధ వహించినట్టు అధికారులు పేర్కొన్నారు. గత 2023 సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 92.93 శాతంతో 17వ స్థానంలో నిలువగా, 2022లో 19వ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈసారి వందశాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలువడానికి చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పదో తరగతి వార్షిక ఫలితాల్లో ఎక్కువ ఉత్తమ గ్రేడ్లు, జీపీఏలు సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించనట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగానే పరీక్షల కంటే ముందే విద్యార్థులను సన్నద్ధం చేయడంతో పాటు వెనకబడిన విద్యార్థులపై శ్రద్ధ వహించామని తెలిపారు. అదే విధంగా సబ్జెక్టులో పట్టు వచ్చేంత వరకు విద్యార్థులకు నెలలో నాలుగు సార్లు యూనిట్ టెస్టులు నిర్వహించామన్నారు. కలెక్టర్ రాజర్షిషా మెరుగైన ఫలితాల సాధన కోసం వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్ చేశారు. సమీక్షలు, సమావేశాలు నిర్వహించి, ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులను సన్నద్ధం చేశామన్నారు. అలాగే భాష ఉపాధ్యాయులకు సైతం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, తరగతి గదిలో విద్యార్థులకు ఏ విధంగా బోధించాలో అవగాహన కల్పించారు. పాత ప్రశ్న పత్రాలను విద్యార్థులకు విశ్లేషించాలని సూచించారు. డీఈఓ ప్రణీత, ఎస్ఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సైతం నిరంతరం విద్యార్థులను పర్యవేక్షిస్తూ వారిపై శ్రద్ధ చూపారు. మరి ఈసారి ఎలాంటి ఫలితాలు రాబోతున్నాయో ఎంత శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తారో రాష్టంలో ఏ స్థానంలో నిలుస్తుందో వేచి చూడాల్సిందే...

బాలల రక్షణకే డీసీపీయూ యూనిట్

- డీసీపీయూ కౌన్సిలర్ పద్మ



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీసీపీయూ కౌన్సిలర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అనేది బాలల రక్షణకే పనిచేస్తోందని డీసీపీయూ కౌన్సిలర్ పి.పద్మ అన్నారు. బుధవారం పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డ్‌లోని తెలంగాణ బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో షూర్ ఎన్జీఓ ఆధ్వర్యంలో షూర్ ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ కె.వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ కిరణ్‌తో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. బాల్య వివాహాల నివారణకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అప్పుడే పుట్టిన నవజాత శిశువు నుంచి 18 సంవత్సరాలలోపు ఎలాంటి సమస్యలను 1098కు ఫోన్ చేస్తే మీ దగ్గరకు వచ్చి, మీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మీ సమస్యను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు వివరించి న్యాయం చేసేలా చేస్తామన్నారు. 18 సంవత్సరాలలోపు పెండ్లిలు చేసుకుంటే ఎలాంటి సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వాటిపై క్లుప్తంగా వివరించారు. ఆడపిల్లల రక్షణ, సంరక్షణ కోసం ఒక వ్యవస్థనే పని చేస్తుందన్నారు. వారికి కోసం ప్రత్యేకంగా జేజేబీ కోర్టు, చైల్డ్‌లైన్, ఐసీపీఎస్, ఎన్జీఓలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఆపదలో ఉన్నవారు ఎవరికి భయపడకుండా డయల్ 100, 181, 1098కి కాల్ చేయాలన్నారు. బాలిక హక్కుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థులతో బాల్య వివాహ నిర్మూలనకై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపల్ జి.మౌనిక, ఉపాధ్యాయులు ఎం.స్వప్న, జే.సునీత, ఈ ప్రణీత, బీ.సరిత విద్యార్థులు ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్

నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బేల మండల కేంద్రంలో రూ.ఒక కోటి యాభై మూడు లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరలో ప్రారంభించాలని బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు బుధవారం నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం నిరుపేదలకు మంచి చేయాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ ఫలాలు అందించిందని అన్నారు. కాని నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను విస్మరిస్తుందని అన్నారు. కోట్లు వెచ్చించి ప్రజల సౌకర్యార్థం ఆస్పత్రిని నిర్మిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన్నప్పటికీ ఆస్పత్రిని ప్రారంభించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రజా ప్రభుత్వమని చెప్పుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఆస్పత్రి ప్రారంభించి మండల ప్రజలకు వైద్యం అందేలా చూడాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడానికి వెనకాడమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దేవన్న, జక్కుల మధుకర్, మస్కె తేజరావు, యువ నాయకులు సతీష్ పవార్, మంగేష్ ఠాక్రె, సునీల్ గోడం, విపిన్ ఖోడే, నానాజీ చరడే, విశాల్ గోడే పాల్గొన్నారు.

పది విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలి

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నవతెలంగాణ-తలమడుగు

పదో తరగతి విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాసి, మెరుగైన ఫలితాలు సాధించాలని డీఈఓ ప్రణీత అన్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో మెరిట్ ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. పాఠశాలల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజనం రుచి శుచితో విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. నేటి విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు. అదేవిధంగా త్వరలో జరగబోవు పదో తరగతి పరీక్షలు నిర్భయంగా రాసి అత్యధిక మార్కులు సాధించాలని విద్యార్థులను కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్‌రావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు లింగారెడ్డి, పాఠశాల మాజీ చైర్మెన్ నేతుల గంగన్న, మహారాష్ట్ర ప్రత్యేక అధికారి స్వామి, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, దేవన్న వడ్నాల లక్ష్మణరావు, బీసీ నాయకుడు



రవికాంత్, పాఠశాల ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మురళీధర్, నగేష్, రాజేందర్, రాకేష్, రవీందర్, చంద్రమ్మ, స్వప్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెరిగిన మెనూ చార్జీలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెరిగిన మెనూ చార్జీలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు, డీఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన మెనూ చార్జీలు డిసెంబర్ నెల నుంచి చెల్లించాల్సిందిపోయి ఇంతవరకు చెల్లించకపోవడం కేవలం ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యమేనని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎంఈఓలు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల కార్మికులకు చెల్లించాల్సిన బిల్లులు వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయని అన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రాధ, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మి, నాయకులు రాజేశ్వర్, మంజుల, పద్మ, గోదావరి, మాయవ్వ, సరస్వతి, లక్ష్మీబాయి, హంస పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో ఆదిలాబాద్‌కు అన్యాయం

- బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు మజర్

నవతెలంగాణ-నేరడిగొండ



అసెంబ్లీలో బుధవారం రోజున 2025-26 ఆర్థిక సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో దత్తత జిల్లాకు ఈసారైనా ప్రత్యేక నిధులు కేటాయిస్తారని ఎదురు చూశామని, కానీ దత్తత జిల్లాకు ధనం దక్కలేదని, బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు మజర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాను ఇందిరమ్మ రాజ్యం దత్తత తీసుకుంటుందని మాట ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి తర్వాత ఇంద్రవెల్లిలో నాగోబా దర్శనానికి ముఖ్యమంత్రి హోదాలో వచ్చి ఎన్నికల సమయంలో మాటిచ్చినం అని రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటాం అభివృద్ధి చేస్తామని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా రెండు ఆర్థిక సంవత్సరాల బడ్జెట్లు కేటాయించిన ఆదిలాబాద్ జిల్లాకి మాత్రం ఒక్క రూపాయి కూడా దక్కలేదని మజర్ మండిపడ్డారు.

గుడుంబా తయారు చేసినా విక్రయించినా కఠిన చర్యలు



నవతెలంగాణ-కడెం

గుడుంబా తయారు చేసినా విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్సై అభిశేఖర్ హెచ్చరించారు. బుధవారం ఎక్సైజ్ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ సమీపంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి, అక్రమంగా గుడుంబా తయారుకు సిద్ధంగా ఉంచిన ఐదు డ్రమ్ముల బెల్లం పాకాన్ని కనుగొని నేర స్థలం వద్ద బెల్లం పాకం ధ్వంసం చేసి, నిందితుని ఇంటి వద్ద తనిఖీలు చేయగా, గుడుంబా తయారీకి ఉపయోగించే 20కిలోల పట్టిక, 120 కిలోల నల్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకుని, నిందితునిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది వెంకటేష్, హరీష్, సాయి, రాజేందర్, కల్పన పాల్గొన్నారు.

ఉట్నూర్ ఉద్యాన నర్సరీ రైతులకు వరం

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్‌లోని ఉద్యాన నర్సరీ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి సుధాకర్ అన్నారు. బుధవారం ఐటిడిఏ ఉద్యాన నర్సరీని ఆయన సందర్శించారు. నర్సరీలో చేపడుతున్న వివిధ రకాల పనుల గురించి ఐటిడిఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్ వివరించారు. నర్సరీలో సాగులో ఉన్న మామిడి, నిమ్మ, జామ, పుచ్చ తోటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన ప్రదర్శన క్షేత్రాలు ఇక్కడ ఏర్పాటు చేశారని ప్రశంసించారు. నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల మామిడి, విప్ప, మునగ మొక్కలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన నీటి కుంటలు, చెరువులను సైతం పరిశీలించి రైతులు ఉపాధి హామీ పథకంలో ఉన్న పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యానాధికారి క్రాంతి కుమార్, నర్సరీ సాంకేతిక అధికారిని అర్పిత, సిపిఫ్ ఎన్జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ పరీక్షలకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రేపటి నుంచి జరిగే ఎస్సెస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల ఇన్‌చార్జి విద్యాధికారి మానుకుమార్ పేర్కొన్నారు. మండలంలో మొత్తం మూడు పరీక్ష కేంద్రాలకు గాను ఆశ్రమ పాఠశాల బాలికలలో 180, విద్యార్థులకు పది మంది ఇన్విజిలేటర్లు, జడ్పీ ఉన్నత పాఠశాలలో 190 మందికి 12 ఇన్విజిలేటర్‌లు, ఆశ్రమ పాఠశాల కేస్లాపూర్‌లో మొత్తం 230 విద్యార్థులకు 15, మంది ఇన్విజిలేటర్‌లను కేటాయించినట్లు ఆయన తెలిపారు. ప్రతి కేంద్రంలో ఒకొక్క డిపార్ట్‌మెంట్ అధికారితో పాటు ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు నిర్ణీత సమయంలోపు పరీక్షలకు హాజరు కావాలని తెలిపారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్

నవతెలంగాణ-కడెం

ఈనెల 21వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు పదోతరగతి పరీక్షల నేపథ్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 300 మీటర్ల పరిధిలో 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని కడెం తహసీల్దార్ ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద ప్రజలు ఎవరూ కూడా గుమిగూడవద్దని తెలిపారు. జిరాక్స్ షాపులు మూసివేయాలని తెలిపారు.

పాఠశాలలో ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీలో భాగంగా ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మన రాష్ట్ర, హర్యానా రాష్ట్రానికి పోల్చడం జరిగిందని ఆ రాష్ట్రంలోని విద్యార్థులకు మన రాష్ట్రంలోని భాష, సంస్కృతి, ఆహార నియమాలు, ఆచార వ్యవహారాలను తెలియజేసి జాతీయ సమైక్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాష, గంగాభవాని, లక్ష్మి ధనరాజ్, సంతోష్, భారతీ, ఆత్మారామ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ద్వారా రామయ్య కళ్యాణ తలంబ్రాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



టీజీఆర్‌టీసీ కార్గో విభాగంతో భద్రాద్రి రామయ్య కళ్యాణ తలంబ్రాలు ఇంటికి పంపించే ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిజామాబాద్ ఏటీఎం పాల్‌తో కలిసి మాట్లాడుతూ భద్రాద్రి రామయ్య కళ్యాణ అక్షింతలు ఇంటికి పంపించే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటి బుకింగ్ కోసం ముందస్తుగా రూ.151 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రామయ్య కళ్యాణ అక్షంతలు ఇంట్లో పెళ్లిళ్ల జరిగినప్పుడు తలంబ్రాలలో, అలాగే పిల్లల పుట్టిన రోజులు జరిగినప్పుడు వాడుకోవచ్చని తెలిపారు. తలంబ్రాలు బుకింగ్ చేసుకొనుటకు 9154298534 నెంబర్ సంప్రదించాలని తెలిపారు.

మాధ్యమిక విద్యకు 'దూరం'

- మండలాల్లో ఇంటర్ కళాశాలలు కరువు
- ప్రజా ప్రతినిధులు స్పందిస్తే మేలు
- అతిథి అధ్యాపకుల సమస్యకు పరిష్కారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే ఆసిఫాబాద్ విద్య, వైద్యం, మౌలిక వసతుల్లో చివరి స్థానంలో ఉంటుందనే విషయం తెలిసిందే. జిల్లాల పునర్విభజన జరిగి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ విద్య పరంగా అభివృద్ధి చెందలేదు. జిల్లాల ఆవిర్భావం తర్వాత నూతన డివిజన్లు మండలాలు ఏర్పాటు చేసే క్రమంలో జిల్లాలో కొత్తగా 3 మండలాలు ఏర్పాటు చేశారు. అయితే ఇంటర్మీడియట్ ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయడంలో మాత్రం ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయా మండలాల విద్యార్థులు మాధ్యమిక విద్యకు దూరమవుతున్నారు.

జిల్లాలో ఇది పరిస్థితి

జిల్లాలో గతంలో 12 మండలాలు ఉండగా 2018లో నూతన మండలాల ఏర్పాటు ప్రక్రియలో పెంచికలపేట, చింతలమానపల్లి, లింగాపూర్ మండలాలను నూతనంగా ఏర్పాటు చేశారు. వీటిలో పదవ తరగతి ఉన్న ఉన్నత పాఠశాలలూ చింతలమానేపల్లి మండలంలో మండల కేంద్రంతో పాటు, బాబాసాగర్, రవీంద్రనగర్‌లో జిల్లా పరిషత్ పాఠశాలలు ఉండగా, రెండు గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఈ మండలం నుండి 150 మంది పదో తరగతి విద్యార్థులు బయటికి వస్తున్నారు. పెంచికలపేట మండలంలో రెండు జిల్లా పరిషత్ పాఠశాలలు రెండు ఆశ్రమ పాఠశాల నుంచి 120 మంది విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధిస్తున్నారు. లింగాపూర్ మండలంలో ఒకటి జిల్లా పరిషత్ ఒకటి ఆశ్రమ పాఠశాల ఉండగా వీటిల్లో 150 మంది, సిర్పూర్(యూ)లో జడ్పీహెచ్ఎస్ ఒకటి ఆశ్రమ పాఠశాలలు రెండు ఉండగా వీటి నుండి 150 మంది ఉత్తీర్ణత సాధిస్తున్నారు.

మాధ్యమిక విద్యకు మైళ్ళ దూరం వెళ్లాల్సిందే

జిల్లాలో పాత మండలం సిర్పూర్(యూ)తో పాటు కొత్త మండలాల్లో కళాశాలలు లేకపోవడంతో ఇంటర్మీడియట్ విద్యకు కిలోమీటర్ల దూరం విద్యార్థులు వెళ్లాల్సి వస్తోంది. పెంచికలపేట, చింతలమానపల్లి విద్యార్థులు కాగజ్‌నగర్, కౌటాల కేంద్రాలకు వస్తుండగా, సిర్పూర్(యూ), లింగాపూర్ విద్యార్థులు ఉట్నూర్, జైనూర్ లకు వస్తున్నారు. అలా వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నవారు పదో తరగతితో విద్య ఆపేస్తున్నారు.

ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించాలి

పక్కనే ఉన్న మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గంలో రానున్న విద్యా సంవత్సరం నుంచి తాండూర్, వేమనపల్లి, నెన్నెల కేంద్రాలలో కళాశాలలు ప్రారంభించడానికి ఇంటర్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విధానంలో జిల్లాకు మంజూరు చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని పలువురు విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు.

అతిథుల సమస్యకు పరిష్కారం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత పది సంవత్సరాల నుంచి అతిథి అధ్యాపకులు పనిచేస్తుండగా తాజాగా నూతన అధ్యాపకులు రావడంతో జిల్లాలో 48 మంది తమ ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చింది. తక్కువ జీతం కావడంతో వేరే చోట చేయలేని పరిస్థితి తలెత్తింది. ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నూతన మండలంలో కళాశాలలు ఏర్పాటు చేయిస్తే ప్రతి కళాశాలకు 11 మంది చొప్పున 44 మందికి తిరిగి ఉపాధి దొరకనుంది. ఇదే విషయంపై అసెంబ్లీలో మాట్లాడాలని జిల్లాలోని ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు కూడా అందజేశారు.



ఎమ్మెల్యే హరీష్ బాబుకు వినతి పత్రం అందజేస్తున్న అధ్యాపకులు (ఫైల్)

నూతన కళాశాలలు ఏర్పాటు చేయాలి

మారుతి, అతిథి అధ్యాపకుడు

రాష్ట్రంలోని ఇతర జిల్లాలలో నూతన కళాశాలలు ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పాటు చేసింది. ఆ విధంగానే జిల్లాలో కూడా నూతన కళాశాలలు ఏర్పాటు చేసినట్లయితే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకొని మాకు అవకాశం ఇవ్వాలి.

ఎల్ఆర్ఎస్ రుసుము వసూలుపై ప్రత్యేక దృష్టి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

లేఅవుట్ భూముల క్రమబద్ధీకరణలో భాగంగా ఎల్ఆర్ఎస్-2020 పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారుల నుంచి రుసుము వసూలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, ఎంపీడీఓ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక అధికారి యశ్వంత్ కుమార్‌లతో ఎల్ఆర్ఎస్ రుసుము వసూలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ రుసుము వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని, చెల్లింపు ప్రక్రియలు జాప్యం జరగకుండా పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించే విధంగా అధికారుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని దరఖాస్తుదారులు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని వివిధ లేఅవుట్ లను పరిశీలించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించి అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణ అభివృద్ధికి ఎల్ఆర్ఎస్ పథకం ఎంతగానో దోహదపడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 31వ తేదీలోగా పూర్తి రుసుము చెల్లించి 25 శాతం రాయితీ మినహాయింపు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

భేటీ బచావో-భేటీ పడావో అమలుకు కార్యాచరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వచ్చే ఆర్థిక సంవత్సరంలో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమాల అమలుపై కార్యచరణ రూపొందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం వచ్చే ఆర్థిక సంవత్సరంలో భేటీ బచావో బేటి పడావో కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో భేటీ బచావో-బేటి బడవో కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేసేందుకు కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో బాల సభలు నిర్వహించాలని, విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలలలో బాలికల విద్య ప్రాముఖ్యత తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థినులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, రక్తహీనత, పోషకాహార లోపాలు గల బాలికలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. విద్యార్థినులకు చదువులో రాణించే విధంగా కార్యక్రమాలు నిర్వహించి, మానసిక నిపుణులతో భవిష్యత్తుపై కౌన్సిలింగ్, కెరీర్ గైడెన్స్‌పై వివరించాలని తెలిపారు. లైంగిక దాడులు జరగకుండా ఆత్మ రక్షణ కొరకు కరాటే శిక్షణ నేర్పించాలని, బాలికల అక్రమ రవాణా, బాల్య వివాహాలు జరగకుండా నిరోధించేందుకు బాలికల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో భేటీ బచావో-బేటి పడావో కార్యక్రమం నిర్వహణకు ప్రణాళిక రూపొందించి, పకడ్బందీగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్, సడీపీఓ రేణుక, జిల్లా మహిళా సాధికారత సమన్వయకర్త శారద, సభ్యులు మమత, రాణి, సాగర్ పాల్గొన్నారు.

బాలల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

బాలల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. మండలంలోని చేడ్వాయి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు, సరస్వతీ మాత ప్రముఖుల విగ్రహాల ఆవిష్కరణ, ధ్యాన్‌చంద్ స్పోర్ట్ రూమ్, పాఠశాల విజన్, గ్రోత్ రిజిష్టర్‌ను మండల విద్యాధికారి రమేష్ బాబుతో కలిసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య, ఎంపీడీఓ అల్బర్ట్ హాజరై సరస్వతీ మాత ప్రముఖుల విగ్రహాలను, ధ్యాన్‌చంద్ స్పోర్ట్ రూమ్, పాఠశాల విజన్ గ్రోత్ రిజిష్టర్‌ను వారి చేతుల మీదుగా ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయుడు తంగడిపెల్లి రాకేష్ అతని తల్లిదండ్రులు శాంత దత్తు గార్ల స్మారకార్థం ఆటవస్తువులు సమకూర్చడం అభినందనీయమని, ప్రముఖుల విగ్రహాలను పాఠశాలలో పెట్టడం వలన విద్యార్థులు వారి ఆశయాలను తెలుసుకొని ఆచరిస్తారని, పాఠశాల విజన్, గ్రోత్ రిజిష్టర్‌లో పాఠశాల అభివృద్ధికి చేసిన, చేయబోయే కార్యక్రమాలను పొందుపర్చాలని, పదవ తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఎలాంటి భయం లేకుండా పరీక్షలు రాసి అత్యున్నత ఫలితాలు సాధించాలని అన్నారు. అనంతరం విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షా కోఆర్డినేటర్లు ఏ సత్యానారాయణ మూర్తి, చౌదరి, ప్రధానోపాధ్యాయులు విజయ నిర్మల, సీహెచ్ ప్రసాద్, అశోక్‌చందర్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి శాంతికుమారి, పీఆర్‌టీయూ తెలంగాణ ప్రధాన కార్యదర్శి తౌటం శ్యాంసుందర్, మాజీ డీసీఈబీ కార్యదర్శి శంకరయ్య, ఉపాధ్యాయులు యాదగిరి, రాకేష్, గంగాభవాని, గంగారాం, సంతోష్‌కుమార్, తాజ్‌పాషా, రాజకమలాకర్‌రెడ్డి, శిల్ప, సుమిత, స్వప్న, సీహెచ్ వెంకటేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఆశా వర్కర్ల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం



కలెక్టరేట్ ఎదుట బైటాయించిన ఆశా కార్యకర్తలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ స్థిర వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. ముట్టడి నేపథ్యంలో స్థానిక సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఆందోళన కారులను కలెక్టరేట్‌లోనికి చొచ్చుకువెళ్లడానికి ప్రయత్నించిన ఆశ వర్కర్లను అడ్డుకున్నారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట పికెటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశాల సమస్యలు పరిష్కరించకపోతే మరో 106 రోజుల పోరాటం తప్పదన్నారు. రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలు ఎదుర్కొంటున్న సమస్యలపైన చర్చలు జరిపి ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏ కార్యక్రమం చేపట్టిన ఆశ కార్యకర్తలను ముందు ఉంచి కార్యక్రమాలను విజయవంతం చేసుకుంటున్నాయని అన్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదన్నారు. బడ్జెట్ సమావేశాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలకు బడ్జెట్‌ను కేటాయించి సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రూ.18,000 స్థిర వేతనం నిర్ణయించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. సమ్మె కాలపు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలకు మేనిఫెస్టోలో చేర్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశలకు ఏఎన్ఎం పోస్టుల్లో ప్రమోషన్ సౌకర్యం కల్పించాలన్నారు. వెయిటేజీ మార్కులు వెంటనే నిర్ణయించాలని, రూ.50 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని అమలు చేస్తూ ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు చెల్లించాలని, వేతనంలో సగం పెన్షన్ రూపంలో చెల్లించాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో వీటిని చర్చించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించడానికి అసెంబ్లీ పార్లమెంటులను సైతం ముట్టడించడానికి ఆశాలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, జిల్లా నాయకులు నగేశ్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వరూప, పద్మ, ఆశా జిల్లా నాయకులు అనితా, పంచశీల, భారతీ, నవీన, పంచశీల పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ ఎన్నిక

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ జూనియర్ సివిల్ కోర్ట్ ఆవరణలో బుధవారం బార్ అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారుగా మహమ్మద్ రైస్ అహ్మద్, అధ్యక్షుడిగా భావండ్లపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా టి దయరాజ్ సింగ్, జి గణపతి, ప్రధాన కార్యదర్శిగా గంట కళ్యాణ్, కోశాధికారిగా పి సతీష్ కుమార్, కల్చరల్ కార్యదర్శిగా ఏ దివాకర్, డి విజయ్ సభ్యులుగా ఎం శంకర్రావు, కిషోర్ కుమార్, వామన్‌రావు, సీహెచ్ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వెనకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఏప్రిల్ 5వ తేదీలోగా ఆన్ లైన్‌లో టీజీఓబీఎంఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, జిల్లా బీసీ కార్యాలయంలో 7989552508, 8374210341 నెంబర్లలో సంప్రదించవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పది పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో నిర్వహించే పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద మార్చి 21 నుంచి ఏప్రియల్ 4 వరకు సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 6779 విద్యార్థులకు 36 పరీక్షా కేంద్రాల వద్ద 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని, అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని తెలిపారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచిరంచారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు రాయితీపై అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మనీషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయితీపై వ్యవసాయ పనిముట్లు నాగలి, కల్టివేటరు, రోటివేటర్లు, ట్రాక్టర్, ట్రైబాన్, స్ప్రేయర్, బ్యాటరీస్ వంటి పరికరాలు రాయితీపై అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళా రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డ్, సాయిల్ హెల్త్ కార్డుతో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వికలాంగులు పథకాలు వినియోగించుకోవాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- అలింకో పరికరాల పంపిణి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అలింకో వారు సంయుక్తంగా వికలాంగులకు పరికరాల ఉచితంగా పంపిణీ చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల పట్ల సేవా దృక్పథంతో అంకితభావంతో పనిచేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత ఉపకరణాలను సరైన రీతిలో ఉపయోగిస్తూ విద్యార్థుల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థులందరూ ప్రత్యేక విద్యా సేవలను ఉపయోగించుకుంటూ వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. జిల్లా సహితవిద్య కోఆర్డినేటర్ కటుకం మధుకర్ మాట్లాడుతూ గత సంవత్సరం ఆగస్టు 24న నిర్వహించిన ప్రత్యేక క్యాంపు ద్వారా గుర్తించిన 137 మందిలో 102 మందికి వివిధ రకాల పరికరాలు అందించినట్లు తెలిపారు. దివ్యాంగ విద్యార్థులు భవిత కేంద్రాల ద్వారా వారి విద్యా సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అలింకో ఇన్‌చార్జి గౌరవ్, ఫైనాన్షియల్ అధికారి దేవాజీ, పరీక్షల సహాయ కమిషనర్ ఉదయభాబు, స్థానిక మండల విద్యాశాఖ అధికారి సుభాష్, ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు, ఐఈఆర్పిలు పాల్గొన్నారు.



పరికరాలు అందజేస్తున్న కలెక్టర్

విద్యారంగాన్ని విస్మరించడం దారుణం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్‌లో విద్య రంగాన్ని విస్మరించడం దారుణమని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జగజంపుల తిరుపతి అన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రాల్లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వమైనా భారీగా నిధులు కేటాయిస్తుందని ఆశించామన్నారు. కేవలం 7.56 శాతం మాత్రమే విద్య రంగానికి కేటాయించడం సవితి తల్లి లాంటిదని ఆరోపించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలన్నారు. ఇందులో పట్టణ నాయకులు పులి సుశాంత్, పులి రామ్, చరణ్ తేజ్, దర్శన్ అజయ్, దాగం వినయ్, అరుణ్‌కుమార్, విలాస్ పాల్గొన్నారు

టీఎస్‌యూటీఎఫ్ ఖండన

గత బడ్జెట్‌తో పోల్చితే నిధులు పెరిగినప్పటికీ అవసరానికి సరిపడే నిధులు కేటాయించలేదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతికుమారి, ఉషన్న బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు.



బిల్లుల ఆమోదం పట్ల సంబరాలు

- సీఎం చిత్రపటానికి పాలాభిషేకాలు



ఆసిఫాబాద్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చట్ట భద్రత, రాజీవ్ యువ వికాసం బిల్లులు ఆమోదం పొందినందుకు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులతో పాటు బీసీ సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు నిర్వహించుకున్నారు. జిల్లా కేంద్రంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలోనే చరిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకుని రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చరణ్ జిల్లా నాయకులు మల్లేష్, శివప్రసాద్, రమేష్, మారుతి పటేల్, కలీం, ఆసిఫ్, దత్తు, శైలేందర్ పాల్గొన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్ నాయక్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌చౌక్ వద్ద ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిజాం, జక్కన్న, బాలేష్, సత్యన్న, కమలాకర్ చారి, సుధాకర్, సమీర్, చిన్న, రమేష్, బాలకృష్ణ, మురళీ, విశ్వనాథ్, మోహన్, అరిఫ్ పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

నవతెలంగాణ-దండేపల్లి



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని యూత్ నాయకులు సంతపురి మనోజ్ విద్యార్థులకు సూచించారు. బుధవారం గుడిరేవు ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్ వితరణ చేయగా వాటిని విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకొని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజశేఖర్, అనిత, లచ్చన్న, నరేందర్, ఖండు సల్మా పాల్గొన్నారు.

ఘనంగా మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి

నవతెలంగాణ-జన్నారం



వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి కార్యక్రమం మండల కేంద్రం సుందరయ్య నగర్‌లో సీపీఐ(ఎం) నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కనికారం అశోక్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం స్వరాజ్యం చేసిన పోరాటం ఎనలేనిది అన్నారు. స్వరాజ్యం ఆశయాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు మగ్గిడి జయ, అబ్దుల్లా పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ బహుమతుల ప్రదానోత్సవం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

విద్యార్థుల ప్రతిభ సామర్థ్యాన్ని గుర్తించడానికి టాలెంట్ టెస్ట్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బహుమతుల ప్రధానం చేశారు. ఆ సంఘం జిల్లా నాయకులు మిట్టపల్లి తిరుపతి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతుల అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మండల విద్యాధికారి హెలెన్‌డారతి, అదనపు ఎస్ఐ రామన్న, హాజరయ్యారు. టాలెంట్ టెస్ట్ మండల స్థాయి మొదటి, రెండవ బహుమతి ట్రినిటీ హై స్కూల్ శ్రీనిధి, రిషింద్ర, మూడో బహుమతి గర్ల్స్ హై స్కూల్, వైష్ణవి, చంద్రిక, గుడ్ షెపర్డ్ కార్తికేయ, విగ్నేష్, కస్తూర్బా గాంధీ పాఠశాల మేఘన, అక్షయ, ఆశ్రమ పాఠశాల అనూష ,తిరుమల, కష్ణవేణి హై స్కూల్ సాయి ప్రణీత, హర్షిని, గురుకుల సంక్షేమ పాఠశాల సంజన, శృతిక, బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ హై స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ, వివిధ పాఠశాల విద్యార్థులు, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్

నవతెలంగాణ-నస్పూర్

బడ్జెట్ సమావేశాల్లో ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనం నిర్ణయించి చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. పోలీసులు భారీకేట్లు పెట్టి ఆశ వర్కర్లను లోనికి వెల్లకుండా సుమారు రెండు గంటలు ఆశా వర్కర్లు బయట ఎండలో నిల్చోని కలెక్టర్ బయటకు రావాలంటూ నినాదాలు చేశారు. వైద్యశాఖ డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ గేటు బయటకు ఆశ వర్కర్ల దగ్గరికి వచ్చి ఆశ వర్కర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి, రాష్ట్ర కమిషనర్ దృష్టికి తక్షణమే తీసుకెళ్తానని స్థానిక సమస్యలు, అధికారుల బెదిరింపులు,పెండింగ్ బిల్లులపై తక్షణమే సమీక్షించి వెంటనే మీకు అందరికీ విడుదల చేసే విధంగా ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తల సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమ్మక్క, శోభ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు సంవత్సరం గడిచిన అమలు చేయలేదన్నారు. ఇప్పటికే అనే దఫాలుగా ఎమ్మెల్యేలకు, మంత్రులకు రాష్ట్ర కమిషనర్‌కు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోకపోవడం లేదని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్లకు నిర్దిష్ట వేతనం రూ.18 వేల చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ నెలలో రాష్ట్ర కమిషనర్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. అర్హులైన ఆశలను ఏఎన్ఎంలుగా ప్రమోట్ చేయాలని అన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్ల పట్ల వ్యవహరిస్తున్న విధానాలు సరికాదన్నారు. ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత లేదని, పీఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్లను శ్రమదోపిడికి గురిచేస్తుందని, ప్రభుత్వ హామీలు అమలు చేయకపోతే మరో పోరాటం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశాలు రాణి, కవిత, అరుంధతి, సుజాత, సువర్ణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి దూలం శ్రీనివాస్, మండల కన్వీనర్ అంబటి లక్ష్మణ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌ను ముట్టడిండించిన ఆశా కార్యకర్తలు

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ గ్రామంలో నివాసం ఉంటున్న ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొండ గొర్ల లింగన్న అన్నారు. బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లెల సర్వేలో భాగంగా కవ్వాల్ గ్రామంలో నాయకులు పర్యటించారు. గ్రామంలో చాలామందికి అర్హత ఉన్నప్పటికీ పెన్షన్లు రావడం లేదన్నారు. గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. గ్రామంలో పోడు చేసుకుని సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలి ఇవ్వాలని కోరారు. గ్రామంలో అత్యధిక మంది పెన్షన్లకు అర్హత కలిగి ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం అధికారులు స్పందించి వెంటనే అర్హత ఉన్న వారందరినీ గుర్తించి పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంబటి లక్ష్మణ్, రాజన్న పాల్గొన్నారు.

పెరికపల్లి భూవివాదం పరిష్కారం



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి మండలం పెరికపల్లి గ్రామంలో అధికారులు బుధవారం భూవివాదాన్ని పరిష్కరించారు. తన ఇంటిని అక్రమంగా ఆక్రమించుకునేందుకు సుమన్ అనే వ్యక్తి ప్రయత్నిస్తున్నారని బెల్లంపల్లి మండలం పెరికపల్లి గ్రామానికి చెందిన బాకం సత్తెమ్మ గత సోమవారం భూ సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ కుఫిర్యాదు చేశారు. స్పందించిన తహసిల్దార్ జోత్స్న, ఆర్ఐ మురళీధర్ పోలీస్ శాఖ అధికారులతో బాధితురాలు ఇంటి వద్దకు వెళ్లి, పరిశీలించి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించారు. ఫిర్యాదుదారు సత్తమ్మ స్వేచ్ఛకు భంగం కలిగించవద్దని బాకం సుమన్ అనే వ్యక్తికి సూచించారు. హద్దు మీరి ప్రవర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి సోమవారం రెవెన్యూ పోలీసు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే భూ సమస్యల ప్రజా వేదికలో బాధితులు ఫిర్యాదు చేసుకున్నట్లయితే పరిష్కార మార్గాలు చూపుతామని తహసిల్దార్ తెలిపారు.

స్టోర్స్ సేఫ్టీని గాలికి వదిలేసిన యాజమాన్యం



స్టోర్‌ను పరిశీలిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఏరియా స్టోర్స్ సేఫ్టీని యజమాన్యం గాలికి వదిలేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా అన్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం ఏరియా స్టోర్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియా స్టోర్‌లోని షెడ్లలో ఎలక్ట్రికల్ వైరింగ్ అస్తవ్యస్తంగా ఉందని, దీనివల్ల షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. స్టోర్స్ యాజమాన్యం పైపై మెరుగులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఏరియా స్టోర్‌లో అర్హత గల టెండల్ సూపర్‌వైజర్ లేరని, గతంలో మందమర్రి ఏరియా స్టోర్స్‌లో టెండర్ సూపర్‌వైజర్ లేక ప్రమాదం జరిగి ఒక కార్మికుడు మరణించిన కూడా యాజమాన్యం టెండర్ సూపర్‌వైజర్‌ను నియమించలేదన్నారు. ఇంత పెద్ద ఏరియా స్టోర్స్‌లో ప్రతి రోజు వందల టన్నుల మెటీరియల్, మిషనరీస్ (గడ్డార్స్, చానల్స్, ఆంగ్లర్స్, ఐరన్ షీట్స్, ఎలక్ట్రికల్ స్విచ్లు, పంపులు, హాలర్లు) అన్లోడ్ చేయవలసి ఉంటుందని, వెంటనే యాజమాన్యం టెండల్ సూపర్‌వైజర్ లను నియమించాలన్నారు. ఏరియా స్టోర్‌కి వచ్చే మెటీరియల్ నాణ్యత ప్రమాణాలు పరిశీలించడానికి సరైన ప్రామాణికాలు లేవని ఇక్కడి యాజమాన్యం తూతూ మంత్రంగా చూసి అప్రూవల్స్ ఇస్తున్నారని దీని ద్వారా యాజమాన్యానికి రూ.కోట్ల నష్టం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శిలు కుమారస్వామి, ఎడ్ల సమ్మయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు రాజ్ కుమార్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని జన్నారం ఎస్ఐ రాజవర్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో సీసీ కెమెరాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అన్నారు. గ్రామంలో ప్రతి చౌరస్తాలో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

కళాశాల వార్షికోత్సవ ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల 17వ వార్షికోత్సవ ఏర్పాట్లను శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఈ నెల 22న నిర్వహించే వార్షికోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. ఆయా విభాగాల అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ వేడుకలకు సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాం, డైరెక్టర్ ఈ అండ్ ఎం సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ వెంకటేశ్వర్లు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎం పర్సనల్ పి అరవిందరావు, పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డి నరసింహ స్వామి, ఏరియా వర్క్ షాప్ డీజీఎం రవీందర్, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కారణ్య నియామక పత్రాలు అందజేత


నవతెలంగాణ-నస్పూర్

కారుణ్య నియామకాలలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో నియామకం పొందిన 52 మంది యువతీ-యువకులకు బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ కారుణ్య నియామకాలు చేపడుతూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని, దక్షిణ భారతదేశంలోనే సింగరేణి సంస్థ దేశానికే తలమానికంగా ఉందని అన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు సర్ఫేస్‌లో లైట్ జాబ్ కోసం ప్రయత్నం చేయకుండా, గైర్హాజరు కాకుండా ఉద్యోగం చేసుకోవాలని అన్నారు. అలాగే తమ తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ, క్రమశిక్షణతో ఉద్యోగం చేసుకోవాలని, సింగరేణిని లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. సింగరేణిలో రెండవ తరానికి ఉద్యోగాలు రావడం మీ అదృష్టంగా భావించాలి అని అన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రగతిపథంలో వెళ్తుందని దానికి అనుగుణంగా ప్రతి ఒక్క ఉద్యోగి రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించడానికి కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, డీజీఎం(ప) పి అరవింద రావు, సీనియర్ పీఓ కాంతారావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేసిన ఏరియా జీఎం శ్రీనివాస్

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సర్వతోముఖాభివద్ధికి సిబ్బంది కషి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని మోతుగూడ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలు, మధ్యాహ్న భోజనం, నిత్యవసర సరుకుల నాణ్యత, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శుద్ధమైన తాగునీటితో పాటు నూతన మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని పేర్కొన్నారు. ఇందులో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ హౌస్ అరెస్ట్

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని లంబాడీతాండ(డీ) గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ అజ్మీర తిరుపతి నాయక్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అసెంబ్లీ ముట్టడి నిరసనలో భాగంగా తిరుపతి నాయక్‌ను ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సంధర్భంగా మాజీ సర్పంచ్ తిరుపతి నాయక్ మాట్లాడుతూ హౌస్ అరెస్ట్ చేయడం హేయమైన చర్యని పేర్కొన్నారు. ప్రజా పాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. గ్రామాల్లో పనులు చేసి బిల్లును రాక అప్పుల పాలైతే మాకు ఇచ్చే గౌరవం ఇదేనా అని అన్నారు. ప్రజలు అన్నీ చూస్తున్నారని, పల్లెలు పట్టణాలకు పట్టుకొమ్మలు అన్నారని, కాని ఇప్పుడు పల్లెలన్ని మురికి కొంపలుగా మారాయన్నారు. మీకు చిత్తశుద్ధి ఉంటే ముందు పల్లెలను అభివృద్ధి చేయండన్నారు. మీ అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, బిల్లులు వచ్చేదాకా పోరాడుతూనే ఉంటామని హెచ్చరించారు. తాము చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు.

ఘనంగా సింగరేణి ఉన్నత పాఠశాల ఫేర్వెల్ డే వేడుకలు



ఫేర్వెల్ డే వేడుకలకు హాజరైన విద్యార్థులు

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి ఉన్నత పాఠశాలలో ఫేర్వెల్ డే వేడుకలు ఆనందోత్సవాల నడుమ ఘనంగా నిర్వహించారు. సింగరేణి ఉన్నత పాఠశాల ఆవరణలో 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు బుధవారం వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ కు ప్రిన్సిపాల్ పురుషోత్తం, విద్యార్థులు పుష్పగుచ్చం అందచేసి ఘనంగా స్వాగతం పలికారు. పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పెన్నులు హాల్ టికెట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులకు గౌరవాన్ని అందిస్తూ చదువు పూర్తి చేసుకుని పాఠశాలను వదిలి వెళుతున్న వారి కోసం ఏర్పాట్లు అభినందనీయమని కొనియాడారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల శిక్షణలో విద్యను అభ్యసించిన ప్రతీ ఒక్కరూ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడులకు లోను కాకుండా చదువు పైనే దృష్టి పెట్టి ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని సూచించారు. సింగరేణి పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం యాజమాన్యం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలతో పాటు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తూ మధ్యాహ్న భోజనం కూడా కల్పిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు బుధవారం సీఈఆర్ క్లబ్‌లో క్వార్టర్స్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌కు మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలకు 93 క్వాటర్స్ ప్రకటించగా 54 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. సీనియార్టీ ప్రకారం 21 మంది ఎన్‌సీడబ్ల్యూఏ మందమర్రి శ్రీరాంపూర్ ఏరియా ఉద్యోగులకు పారదర్శకంగా క్వార్టర్స్ కేటాయించినట్లు పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యామ్ సుందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం విజయ్ ప్రసాద్, డీజీఎం ఐఈడీ రాజన్న, డీవైపీఎం మైత్రేయ బంధు, రాజలింగు ఒఎస్ పాల్గొన్నారు.



కొనసాగుతున్న ఇంటి పన్నుల వసూలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుల వసూలు కొనసాగుతోంది. ఇప్పటికే కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ కూడా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి 100 శాతం ఇంటి పన్నుల వసూలు చేయాలని ఆదేశించడం జరిగింది. దీంతో కమిషనర్ భుజంగరావు ఆ దిశగా చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో మున్సిపల్ అధికారి రవికుమార్ సిబ్బంది ఉదయకుమార్ ఇంటింటికి తిరుగుతూ పన్నుల వసూలు చేపట్టారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం హర్షణీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్ని అడ్డంకులు వచ్చినా వాటిని లెక్క చేయకుండా సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం హర్షణీయమని మాదిగ జేఏసీ అధ్యక్షుడు మల్యాల మనోజ్ అన్నారు. వర్గీకరణను స్వాగతిస్తు బుధవారం అంబేద్కర్‌చౌక్‌లో మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాలులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంజాబ్ రాష్ట్రంలోని బల్వీందర్ సింగ్ ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారన్నారు. వర్గీకరణ అంశాలను రాష్ట్రాలకు అప్పగిస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. దానికి అనుగుణంగా సీఎం ఎన్ని అడ్డంకులు వచ్చిన వర్గీకరణకు చట్టబద్ధత కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

క్రమశిక్షణతో చదివి ఎదగాలి

నవతెలంగాణ-తలమడుగు

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని మండలంలోని బరంపూర్ జిల్లాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యూష అన్నారు. బుధవారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఏర్పాటు చేయగా, ఆమె పాల్గొని మాట్లాడారు. ఏరంగంలో రాణించాలన్న అందుకు చదువు అతి ముఖ్యమన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని నచ్చిన రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. పదవ తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడిలకు గురికాకుండా చదివి పరీక్షలు రాయాలన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ అలరించాయి. ఇందులో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, శశికళ, సుజాత, ప్రవీణ్, ప్రజ్ఞ, జ్యోతి, రవీందర్, అమరేందర్ పాల్గొన్నారు.



మందు బాబులకు అడ్డాగా పాఠశాల ఆవరణ



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. నిత్యం సాయంత్రం అయిందంటే మందుబాబులు విచ్చలవిడిగా మద్యంతాగుతూ ఖాళీ సీసాలు, సిగరెట్లు అక్కడే వదిలి వెళ్లడం పగలగొట్టడం చేస్తున్నారు. ఉదయం పాఠశాలకు విద్యార్థులు వచ్చేసరికి ఎక్కడ చూసినా ఖాళీ బీరు సీసాలు, సిగరెట్లు దర్శనం ఇస్తున్నట్లు కొన్ని సందర్భాల్లో పగిలిన సీసాలు విద్యార్థులకు గాయాలు అయినా సందర్భాలు ఉన్నాయని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అంటున్నారు. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో పాఠశాల పక్కనే కస్తూరిబా గాంధీ బాలికల వసతి గహం ఉండటం ఆ పరిసరాల్లోనే రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగడంతో కేజీబీవీ బాలికలు ఆందోళన చెందుతున్నారు. పోలీస్ సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, రాత్రి సమయంలో ఇటుపక్క గస్తీ తిరగకపోవడంతో మందుబాబులు యధేచ్ఛగా తమ పని కానిస్తున్నారు. ఇకనైనా తగు చర్యలుతీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని 14 వార్డుకు చెందిన అనిల్ అనే యువకుడు ద్విచక్ర వాహనం పై నుంచి ప్రమాదవశాత్తు పడిపోయి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బుధవారం పట్టణానికి చెందిన గుల్జార్ మస్జిద్ ట్రస్ట్ బాధ్యులు యువకుడిని పరామర్శించి రూ.6 వేల ఆర్థిక సాయం అందించారు. ఇందులో ట్రస్ట్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్ రావడం అభినందనీయం

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని నాలుగు ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలకు జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్ లభించడం అభినందనీయమని కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని సారంగాపూర్ మండలం చించోలి(బి), లక్ష్మణచందా మండలం మల్లాపూర్, ముథోల్ మండలం తరోడ, బాసర మండలంలోని కౌట నాలుగు ఆరోగ్య కేంద్రాలకు ఈ సర్టిఫికెట్ లభించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

సేవాలాల్ ఎంప్లాయిస్ కదలికతో విగ్రహం ఏర్పాటుకు కృషి

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తడిహత్నూర్ గ్రామంలో రెండేళ్ల క్రితం ఏర్పాటైన సేవాలాల్ ఎంప్లాయిస్ యూనియన్ సమాజ సేవలో ముందంజలో ఉంటోంది. గ్రామంలో ఇప్పటి వివిధ సేవా కార్యక్రమాలు, తమవంతు ఆర్థిక సహాయం అందించారు. ఈ క్రమంలో సమాజ పెద్దలతో చర్చించి వారిని ఏకతాటి పైకి తీసుకొచ్చి గ్రామంలో ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్, రామారావ్ మహారాజ్, లక్కీషా బంజారాల విగ్రహాల నిర్మాణం కోసం కృషి చేశారు. సమాజ ప్రజలు తమకు తోచినంత చందాను యూనియన్ సభ్యులకు అందిస్తున్నారు. మొత్తంగా విగ్రహాల ఏర్పాటుకు యూనియన్ సభ్యులు ముందుకు రావడం, పనులు ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్‌ఎస్‌ఎస్, 144సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్ష కోసం ఏర్పాటు చేసిన 52 సెంటర్లలో పై సెక్షన్‌లు అమలులో ఉంటాయన్నారు. కాగా మొత్తం 10106 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల 200 మీటర్ల వరకు ఎవరు గుమికూడి ఉండకూడదని,. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులకు, డీజేలతో, ఊరేగింపులకు, ధర్నాలకు, ప్రచారాలకు అనుమతిలేదని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసర ప్రాంతాలలో ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ దుకాణాలను మూసివేసి ఉంచాలని పేర్కొన్నారు. పట్టణంలో విద్యార్థులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సిబ్బంది ద్వారా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100ను వినియోగించుకోవాలని సూచించారు.

రేపటి నుండి మూల్యాంకనం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్, కేజీబీవీ, ఆదర్శ ప్రైవేట్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులకు మొదటి విడత మూల్యంకనం ఈనెల 21 నుండి నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ జాదవ్ గణేష్‌కుమార్ పేర్కొన్నారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం పౌరశాస్త్రం సబ్జెక్టులకు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధ్యాపకులు ఉదయం 10 గంటల వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అంగడి బజార్ వేలం పాట

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే అంగడిబజార్ వేలం పాట శుక్రవారం నిర్వహించనున్నట్లు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఒక ప్రకటనలో తెలిపారు.

గవర్నర్ దత్తత గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, ఐటీడీఏ పీఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

గవర్నర్ దత్తత తీసుకున్న బుర్కి గ్రామాన్ని బుధవారం కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బూగుప్తా సందర్శించారు. వారికి గ్రామస్తులు సంప్రదాయ పద్ధతిలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో అంగన్వాడీ భవనం, కమ్యూనిటీహాల్ నూతనంగా నిర్మించడం జరిగిందన్నారు. గ్రామాభివృద్ధితో పాటు, గ్రామంలో అన్ని మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరుగుతుందన్నారు. అంకోలి నుంచి బుర్కి గ్రామానికి 6 కిలో మీటర్లు ఉంటుందని, ముందుగా రెరెన్యూ శాఖకు సంబంధించి 1.6 కిలో మీటర్లు బీటీ రోడ్డు నిర్మాణం, తదుపరి అటవీ శాఖ అనుమతులతో మిగితా రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ నిర్మాణ పనులు మార్చి చివరి లోగా పూర్తి చేయాలని ఈఈ ట్రైబల్ వెల్ఫేర్‌ను ఆదేశించారు. ఓపెన్‌వెల్, రిటర్నింగ్‌వాల్ ఏప్రిల్ 7 తేదీ వరకు పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ ద్వారా 20 మందికి డీజిల్ ఇంజన్, స్ప్రింకర్లు, ట్రాక్టర్, క్రషర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు దుప్పట్లు, విద్యార్థులకు యూనిఫాంలను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇందులో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ, డీడబ్ల్యూఓ, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ, ఫారెస్ట్, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ శాఖ అధికారులు, ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఊర పిచ్చుకల ఆవశ్యకతపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కష్ణ పిచ్చుకల ఆవశ్యకత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఊరపిచ్చుకల సంఖ్య రోజు రోజు తగ్గుతోందన్నారు. పంటలపై క్రిమిసంహారక మందుల వాడకంతో ఆయా పంటగింజలు తిని పిచ్చుకలు మృత్యువాత పడుతున్నాయన్నారు. ఈ పక్షులు చెట్లపై ఉంటే కీటకాలను సైతం తిని జీవిస్తాయన్నారు. కానీ చెట్ల సంఖ్య కూడా తగ్గుతుండటంతో వాటికి ఏటూ ఆవాసం లేకుండా పోతోందన్నారు. ఈ పిచ్చుకలను రక్షించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. వేసవి దృష్ట్యా ఇళ్ల వద్ద పిచ్చుకల కోసం నీటిని చిన్న చిన్న మట్టిపాత్రల్లో ఉంచాలని కోరారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, అధ్యాపకులు రడాపు సంతోష్ కుమార్, ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేల వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, జిల్లా విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు 8 నెలల నుండి కోడిగుడ్ల బిల్లులు, 3 నెలల నుండి వేతనాలు బకాయిలున్నాయని, ఒకపక్క వారానికి 3 కోడిగుడ్లు పెట్టాలని కార్మికులను అధికారులు ఒత్తిడి చేస్తున్నారని బిల్లులు చెల్లించకుండా ఇలా ఒత్తిడికి గురి చేయడం సరికాదన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇందులో ఎండీఎం యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శారద, మాయ, యూనియన్ నాయకులు శ్యామల, తిరుపతి, నవీన్, భీంబాయి, చంద్రకళ, అనసూయ, విజయ, సువర్ణ, రాజేశ్వరీ, లక్ష్మీ ఊర్మిళ పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టు ఈఈపై చర్య తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కడెం ప్రాజెక్టు ఈఈ పై చర్య తీసుకోవాలి కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు తరపున కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ప్రాజెక్టు ఈ ఈ సమయపాలన పాటించకుండా నీళ్ల వదలడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఎనిమిది రోజులు నీళ్ల వదిలి ఏడు రోజులు నీళ్ల బంద్ చేయాల్సి ఉండగా ఐదు నుండి ఆరు రోజులు మాత్రమే నీళ్ల వదలడం పది రోజులు బంద్ చేయడం వలన వరి పొలాలు ఎండిపోతున్నాయన్నారు. ఇందులో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ తిరుపతి, హెచ్‌ఆర్‌సీ జిల్లా అధ్యక్షులు సురకంటి ఎల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బరికుంట గంగారం, గడ్డం రాజేష్ పాల్గొన్నారు

నిధులను సమర్థవంతంగా వినియోగించాలి



నవతెలంగాణ-నిర్మల్

పట్టణాల అభివృద్ధికి కేటాయించిన నిధులను సమర్ధవంతంగా వినియోగించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మున్సిపాలిటీలలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైనా నిధులను పారదర్శకంగా వినియోగించాలన్నారు. కేటాయించిన నిధులు, చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధులు, అందుబాటులో ఉన్న నిధులకు సంబంధించిన వివరాలను ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్కుల్లో పచ్చదనం పెంపొందించలన్నారు. గేట్లు, గోడలకు పెయింటింగ్ వేసి, మెరుగైన లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ వాసులను భాగస్వామ్యం చేస్తూ, పార్కులకు అసోసియేషన్ ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ శాఖకు సంబంధించి వచ్చిన సమాచార హక్కు చట్టం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, జాదవ్ కృష్ణ, రాజేష్ కుమార్, మున్సిపల్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చారిత్రాత్మక నిర్ణయం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం బీసీ రిజర్వేషన్‌లు, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదరరాజనర్సింహ, సీతక్క, పొన్నం ప్రభాకర్‌గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఇందులో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చిన్ను, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సమరసింహరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి మల్లారెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అల్లూరి కష్ణవేణి, కౌన్సిలర్లు కత్తి నరేందర్, ఎస్పీ రాజు, రామకష్ణ, దర్శనం చిన్నయ్య, ఆలయ కమిటీ చైర్మన్‌లు గంగోని భూరాజ్, కొండ శ్రీనివాస్, కొడుకుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ



నవతెలంగాణ-తలమడుగు

బోత్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మండలానికి పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ సహకారంతో 1 కోటి 50 వేల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు కాగా బుధవారం మండలంలోని బరంపూర్ గ్రామంలో బీజేపీ సీనియర్ నాయకులు కనపర్తి చంద్రాంత్ బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ గోడం నగేష్ ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.కోటి 50 వేల మండలంలోని పలు గ్రామాలను అభివద్ధి చేసేందుకు మంజూరు చేశారన్నారు. కుచులాపూర్ రూ.13 లక్షలు, పల్సి(కే) రూ.7లక్షలు, లింగికి రూ.3 లక్షలు, సుంకిడికి రూ.5లక్షలు, తలమడుగుకు రూ.10లక్షలు, ఉండంకు రూ. 9లక్షలు, ఖోడద్‌కు రూ.3లక్షలు, కజ్జర్‌లకు రూ.5 లక్షలు, దేవాపూర్‌కి రూ.10 లక్షలు, పల్లి(బి)కి రూ.4 లక్షలు, అర్లి (కే)కి రూ.8లక్షలు, చర్లపల్లికి రూ.7 లక్షలు, ఘరి రూ.5లక్షలు, మందగూడ రూ.3 లక్షలు, బరంపూర్‌కి రూ.8లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో మండల నాయకులు కిరణ్, భుజంగరావు, నారాయణరెడ్డి, బోండ్ల వెంకటస్వామి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మహేందర్ యాదవ్, అశోక్, రవిరెడ్డి, సంజయ్ సురేందర్ పురుషోత్తం మహేందర్, హేమంత్ పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జైలు శిక్ష

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మండలంలోని పాతయేల్లాపూర్ గ్రామానికి చెందిన మాసం రాజేశ్వర్ బైండోవర్ ఉల్లంగించడంతో అతన్ని జైలుకి పంపినట్లు ఎక్సైజ్ ఎస్సై అభిషేక్ తెలిపారు. ఎక్సైజ్ అధికారుల వివరాల ప్రకారం మాసం రాజేశ్వర్ గతంలో నాటుసారాయి విక్రయస్తూ పట్టుబడగా అతని పై కేసు నమోదు చేయడం జరిగింది. మండల తహసీల్దార్ ఎదుట రూ. 2 లక్షల జరిమానా లేని పక్షంలో రెండేండ్ల జైలు శిక్షకి బైండోవర్ విధించారు. బైండోవర్ ఉల్లగించి మళ్లీ నాటుసారాయి అమ్మడంతో అరెస్టు చేసి ఆదిలాబాద్ జిల్లా జైలుకి పంపినట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా కడెం మండలంలోని లక్ష్మీపూర్‌లో పోడేటి సత్యగౌడ వద్ద 120 కేజీల నల్ల బెల్లం, 20 కేజీల పటిక లభించినట్లు, అతని వద్ద గల 500 లీటర్ల బెల్లం పాకనం ధ్వంసం చేసి అతడి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గిరిజన యువకులు చదువుతో పాటు క్రీడలో రాణించాలి

నవతెలంగాణ-బోథ్

గిరిజన యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తులశ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ తులశ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని పార్టీ(బి) గ్రామంలో 100 మంది యువకులకు 100 టీషర్టులు పంపిణీ చేశారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఇందులో సొసైటీ అధ్యక్షుడు ఇర్ల అభిలాష్, మాజీ సర్పంచ్ మారుతి, నాయకులు రోహిదాస్, భీంరావ్, సోమన్న, నరేందర్, చిన్నయ్య, మహేష్, గ్రామ సార్మేడి లక్ష్మణ్, సుంగన్న, భీంరాజ్, నగేష్ సురేష్, శంకర్, సుదర్శన్, వెంకటేష్, రాము, హేమన్‌రావు, సీతారాం, పాల్గొన్నారు.

ఆర్‌బీఎస్‌కే కాంట్రాక్ట్ ఉద్యోగాల మెరిట్ లిస్ట్ విడుదల

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఆర్‌బీఎస్‌కే కాంట్రాక్ట్ ఉద్యోగాల మెరిట్ లిస్ట్ విడుదల చేసినట్లు వైద్యాధికారి ఆయుష్ తెలిపారు. మెరిట్, రిజక్ట్, సెలెక్ట్ అయిన జాబితా జాబితా లిస్ట్ లను ఎఎఎ.అఅతీఎఖశ్రీ.వశ్రీఖఅస్త్రుఙఖ.స్త్రశీజ.అఅ, జూశీత్మీఖశ్రీలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

22న కళాశాలలో యువజనోత్సవ పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో మార్చ్ 22న జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే.సంగీత, నెహ్రూ యువజన కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ సుశీల్ బడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చ్ 22న నిర్వహించే జిల్లా యువజనోత్సవ పోటీలలో 15-29 మధ్య వయసు గల డిగ్రీ చదివినా లేదా చదువుతున్న యువతీ యువకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్, పెయింటింగ్, మొబైల్ ఫోటోగ్రఫీ, కవితా రచన, ఉపన్యాస పోటీ, సంస్కృతిక నృత్య విభాగం, పోటీలో గెలుపొందిన వ్యక్తిగత బృందా క్యాటగిరీలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు నగదు రూపంలో అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల యువతీ యువకులు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

గోండు గోవారీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న గోండు గోవారీలను రాష్ట్రంలో ఏ కులంలోనూ చేర్చకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు, తమను ఎస్టీ సామాజిక వర్గంలో చేర్చాలని స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన గుండు గోవారీ సంఘ ప్రతినిధులతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. సమస్యను తీర్చాలని కోరారు.

మాదిగ సంఘ భవనానికి స్థలం కేటాయించాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలో మాదిగ సంఘ భవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావుకుకి ఆ సంఘం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలో అన్ని కుల సంఘాలకు భవనాలు ఉన్నాయని మాదిగ కుల సంఘానికి భవనం లేకపోవడంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోలేకపోతున్నామని తెలిపారు. ఇందులో నాయకులు రవికుమార్, లక్ష్మణ్, ఆనంద్, నరేందర్, సురేష్, శివ, దర్శనం, సాయన్న, పడిగెల గంగాధర్, సాయేందర్, రాజేష్, ప్రభాకర్, విష్ణు, రాజేశ్వర్, సాగర్ ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జామ్ గ్రామానికి చెందిన కోర్వ నవీన్ రెడ్డి న్యాయవాది నెలకొల్పిన కెఎన్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని స్వర్ణ, కంకెట, బీరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, ఇంగ్లీష్ డిక్షనరీలు పరీక్ష సామాగ్రి అందజేశారు. ఇందులో హెచ్‌ఎంలు కష్ణ, సాయన్న, నాయకులు నర్సయ్య, నారాయణరెడ్డి, మారుతి, రవీంద్రనాథ్‌రెడ్డి, రాజేశ్వర్, ప్రశాంత్, రాజు, రాజేంద్ర ప్రసాద్, మసిరుద్దీన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ దాసరి మహేందర్ బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకి ఆర్‌ఓ వాటర్ ప్లాంట్, ప్రింటర్‌ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాఘవేంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు తాగునీటి అవసరార్థం ఆర్‌ఓ ప్లాంట్ అందించినట్లు పేర్కొన్నారు. ఇందులో హెచ్‌ఎం రమేష్ జాదవ్, పాఠశాల సిబ్బంది కృష్ణ, నిరూప నాయక్, జాడీ రమేష్, రాములు, ఉపేంద్ర, రాంప్రసాద్, సునీల్, నవీన్, గణేష్ పాల్గొన్నారు.